పరీక్షలకోసం చదివే పద్ధతులు నానారకాలుగా ఉంటాయి. వీధి లాంతర్ల కింద చదివిన వాళ్ళందరూ దేశాధ్యక్షులు అయిఉండలేదు. ఇంట్లో ఇరుకువల్లో వచ్చేగాలి పీలుస్తూ అటూ ఇటూ పచార్లు చేస్తూ పుస్తకాలు తిరగెయ్యొచ్చునో, ఇద్దరు ముగ్గురు కలిసి 'కంబైన్డ్ స్టడీస్' చెయ్యొచ్చునో— రకరకాల కారణాలవల్ల పరీక్షల సమయంలో స్టూడెంట్స్ రాత్రిళ్ళు యూనివర్శిటీ పరిసరాల్లో వెల్తురు దొరికే చోట్లకి



చేరుతూ ఉంటారు.

హాస్టల్లో ఉన్నా నేను.

ఇంటికన్న గుడి పదిలం అన్నారు. కాని, చదువుకోవటానికి మాత్రం ఇంటికన్న హాస్టలు అనువేమీ కాదు. హాస్టలు గదికన్న ప్లేగ్రౌండ్ వార సిమెంటు మెట్ల అవతలున్న ట్యూబులైటు మేలనిపించింది.

రాత్రి ఎనిమిదిన్నర కల్లా భోజనం ముగించేసి టెక్స్టుబుక్కుల పుచ్చుకుని ప్లేగ్రౌండ్ చేరుకునేవాణ్ణి.

కాంపస్‌లో ట్యూబులైట్లకు కొదవలేదు. కాని మళ్ళీ ఇక్కడా పంఖ్య అధికమై పోటీ ఏర్పడింది. ఒక్కో ట్యూబులైటు కిందా పదిమందైదుగురు పోగవటం మొదలైంది.

కాంపస్‌లో రాత్రిళ్ళు వాహనాల సంచారంగా అసలుండదు. అందుచేత కొందరు బాచీలుల బాచీలు రోడ్ జంక్షన్స్‌లో బిచాణా వేసేస్తున్నారు.

ప్లేగ్రౌండ్— హాస్టల్స్‌కి కొంచెం దూరంగా ఉంది. మెయిన్‌రోడ్డు దాటుకుని వెళ్ళాలి. నిద్రపడితే అక్కణ్ణుంచి హాస్టల్‌కి తిరిగిరావడానికి చెడ ఇబ్బంది పడాల్సొస్తుంది. మధ్యలో టీ, సిగరెట్లు అవసరమైతే చాలా కష్టం.

అందుచేత ప్లేగ్రౌండ్ దగ్గరికి మామూలుగా ఆట్టేరారు.

ఏకాంతంమీది కోరికతో ప్లేగ్రౌండునే ఎన్నుకున్నాను. ఏ తెల్లవారు జామునో నిద్రపట్టేదాకా చదవడం అక్కడే నిద్రపోవడం! ఎండ చురచురకి మేలుకుని తిరిగి రావటం!. వాన భయం లేదు. సిమెంటు మెట్లపైన మంచిషెల్టరుంది.

చదువు చక్కగా సాగుతోంది. క్లాసొస్తుందన్న నమ్మకం కలుగుతోంది. థాంక్స్ టు ప్లేగ్రౌండ్ అనుకునే వాణ్ణి.

చీకట్లో ప్లేగ్రౌండ్‌కేసి చూస్తే వింత అనిపించేది.

మరీ ఎక్కువ చదివేశాననిపించినప్పుడూ, చదివిందినెమరేసుకోవాలనుకునేపుడూ నిద్దరాక ఏమీ తోచక ఉన్నప్పుడూ— చీకట్లో ఆ గ్రౌండులో అటూ ఇటూ పచార్లుచేస్తూ ఉండేవాణ్ణి.

మనుష్యుల్నేగాక జంతుజాలాన్నే కాక కొన్నిస్థలాల్ని కూడా ప్రేమించే సన్నివేశాలు అప్పుడప్పుడూ కలుగవచ్చు.

ఈ ప్లేగ్రౌండ్ వారన చదువుకున్న నేను, ఫస్టు క్లాసులో పాసై రిసెర్చి పూర్తిచేసి, ఏ ఫారిన్‌కో వెళ్ళి, పెద్ద ఉద్యోగినైపోతే— అప్పుడు కూడా ఈ ప్లేగ్రౌండ్ నాకుగుర్తుంటుందా— అనుకునేవాణ్ణి.

సంవత్సరంలో ఏ నెలరోజులో ఉపయోగపడుతుండి ఈ ప్లేగ్రౌండ్—స్పోర్ట్స్‌కి, గేమ్స్‌కీ. అంతే. మిగిలిన రోజుల్లో ఏకాకిగా బిక్కుబిక్కుమని పడి ఉంటుంది.

దేశానికి ప్రెసిడెంటుని కాకున్నా— ఏమో— నేనూ ఒక తగుపాటి విఖ్యాత పురుషుణ్ణయిపోయి— నా జీవిత చరిత్ర రాస్తూ ఈ ప్లేగ్రౌండ్‌ను పేర్కొంటే— ఇక్కడో స్మారక శిలాఫలకం ప్రతిష్ఠిస్తారేమో!

దేశమంతా స్మరించకున్నా, నేను మాత్రం స్మరించేట్లు ఒకరాత్రి అక్కడో సంఘటన జరిగింది.

సిమెంటు మెట్లమీద సెటిలయి సీరియస్‌గా చదువుకుంటున్నాను. లీలగా రెండు గొంతులు విని పించాయి. ఆడ—మగ.

'యేంది...యాడకి తీసకొచ్చినావ్...వద్దు.

"గిరవుండులో కెల్ పోదామే..గెడ్డుంటాది... యెవురూ రారు..."

"యింటికెల్ పోవాలి నేను...ఆడసలే అనుమానం మనిసి.."

"క్ష... పోదూలేయే... జంపింగు దూకేయిప కుంటాది..యెవురికన్నిపించం శీగటి గుంటాది..."

"వాచ్‌మానుంటాడు..యెవురన్నా వస్తారు..."

"యెవ్వరారు.. వాచిమాను యీపక్కకే రాడెప్పుడూ...యాణ్ణోతాగి పండుకోమంటాను— అరె రాయే—"

అనుకోకుండానే చెవులు రిక్కించి వింటున్నాను.

కళ్ళు చిట్లించి చూశాను.

సర్కారు ముళ్ళచెట్ల కవతల లీలగా రెండు ఆకారాలు!

ఆ చెట్ల కవతలినుంచి గ్రౌండ్‌లో కెళ్ళొచ్చు.

ఫెన్సింగ్ తీగలు మనిషి దాటటానికి వీలుగా వంచేసి ఉన్నాయి.

"యెల్ పోదాం" అంటూనే ఉంది స్త్రీ ఆకారం.

"అరే— రాయే— పోదాంలే—రాయే" అంటూ మగవాడు ఆమెచెయ్యి పుచ్చుకుని అటు లాక్కెళ్ళాడు.

నాచేతి నుంచి పుస్తకం జారిపోయింది. మనుషులు అప్రయత్నంగా ప్రవర్తించే సన్నివేశం అది. మెల్లిక్కి స్పృహ వచ్చాను.

నేను నిలుచున్న చోట మసక చీకటి. వాళ్ళకి కనిపించను. స్తంభాలున్నాయి. మెయిన్ రోడ్డుమీద దీపాలకాంతి గ్రౌండులో అక్కడక్కడా మసకచారలుగా పడుతోంది. అంతే.

మరి దూరంగా వెళ్ళలేదు ఆకారాలు. చీకటి పొరల్లో కలిసిపోయాయి.

మాటలు నవ్వులై పిదప అన్నీ అణిగిపోయాయి.

ఒక్కసారిగా నవ్వొచ్చింది.

ప్లేగ్రౌండ్ ఇలా కూడా ఉపయోగపడుతోం దన్నమాట.

అనుమానాలు కారు వాళ్ళు. పెళ్ళి చేసుకోబోతున్న ప్రేమికులూ కారు. చీకటిలో ఎన్నో అవసరాలు. ప్లేగ్రౌండ్ ఇలా లోగడ ఎంతమంది అందుకుందోగాని.

మళ్ళీ మెట్లమీద కూర్చుని కూచున్నాను. ఏదో అలికిడయింది. సర్కారు చెట్ల కవతల కదులుతున్నాయి మరో రెండు ఆకారాలు.

పరీక్షగా చూశాను. ఇద్దరు మగవాళ్ళు ఒకడు నిక్కర్లో ఉన్నాడు. మరొకడు పాంటు.

ఇద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నారు, తగ్గు స్వరంలో.

రెండు మూడు క్షణాల్లో రెండు ఆకారాలు ప్లేగ్రౌండు వేపు వెళ్ళాయి.

అర్థమయినా కానట్టు నాకేదో స్ఫురించింది. గబగబ మెట్లెక్కి స్తంభాల వారకి వెళ్ళాను.

పాంటు, నిక్కరు కొంత దూరం నడిచాయి. ఆగాయి. పాంటు తొడుక్కున్న కాళ్ళకి నల్లటిబూట్లు నిగనిగలాడుతున్నాయి. నిక్కరు మనిషి గట్టిగా అరిచాడు—ఏయ్... ఎవరది? ....

చీకటి వారల్లోంచి అదిరిపడ్డ గొంతులు వినిపించాయి.

ఆ.... ఎవరురా?!....

అయ్యో!.. ఎవరో...

మెరుపులా కదిలాడు నిక్కరువాడు—ఎవర్రా అదీ... ఆ?..లెయ్యండాన్నుంచి ముందు.. అంటూనే రెండు మూడు బూతుమాటలు దొర్లించాడు.

తత్తరపడిన నాటు ప్రేమికుల జంట (?) చీకట్లోంచి మసక చీకట్లో కొచ్చింది.

ఎవరు మీరు—

"పోలీసులా గుండాల్రా...

మరంతే— అయిది

"అన్నా— పొరపాటైపోయింది—వది లెయ్యి—"

నల్లబూట్ల పాంటు వాడు— ఇన్‌స్పెక్టర్‌లా ఉన్నాడు— ఉన్నచోట్నుంచి కదల్లేదు. దర్పంగా, కర్కశంగా అన్నాడు— "మాట్లేంటి— తండ్రి కూడా నిక్కరు కానిస్టేబుల్ ఉన్నట్టుండి కదిలాడు. నాటు ప్రేమికుణ్ణి డొక్కలో తన్నాడు. చెంపలమీద ఫెడీఫెడీమని మ్రోగించాడు. కదలవేంరా లమిడీ కొడకా..ఇన్‌స్పెక్టర్ దొర పిలుస్తుంటే..."

దెబ్బకి "ఆ—అమ్మా—ఆ..." అన్నాడు నాటు ప్రేమికుడు. మరోమాట పెగల్లేదు.

యమ్మా... యాడంటే ఆడ...నల్ల కొవ్వెక్కి పడండి... నడండి స్టేషన్‌కు—పూ..." నాటు ప్రేయసి వీపున రెండు గుద్దులు ప్రసాదించాడు కానిస్టేబుల్.

"అన్నా—వదిలెయ్యన్నా... ఆడసలే అనుమానం మనిషి— చంపేస్తాడు బాబో—"

అరిగే ఉన్నా గోలగా ఉంది వ్యవహారం.

### ఉన్నాడో, లేడో

భగవంతుడు ఉన్నాడో, లేడో నాకు తెలియదు అనే వాడితో ప్రమాదం లేదు. కాని దేవుడు లేడు అని వాదించేవాడితోనే ప్రమాదం.

— బిస్మార్క్

నాటు ప్రేమికుడు ఇన్‌స్పెక్టరుగారి బూటు కాళ్ళకి మొక్కాడు. "బుద్ధి పొరపాటయింది సార్... ఎప్పుడు చెయ్యన్ సార్.. సిర్సార్..."

ఇన్‌స్పెక్టరుగారు ఎక్కువ మాట్లాడలేదు కాని మోకాలుతోనూ, మోచేతులతోనూ నాటు ప్రేమికుడి వాళ్ళు కుళ్ళబొడిచేశారు.

లంజకొడకా—గెటవుట్— ఐవిల్ సీయువ రెంగ్— రాస్కెల్— గెటవే— ఈ చాయల్లో కనిపిస్తే పొక్కు తీసేస్తాను—నాలుగు వారాలకి పంపించేస్తాను— రాస్కెల్— వెళ్ళిపో—పో...."

గొప్ప రిలీఫ్‌గా ఫీలయిన నాటు ప్రేమికుడు చచ్చి మీ కడుపున పుడతాన్సార్— వస్తాన్సార్—ఆ మళ్ళీ యిటుపక్క రాన్సార్...." అంటూ కృతజ్ఞతలు తెలుపుకుని—"రావే" అన్నాడు నాటు ప్రేయసితో.

"ఫిరా— కంత్రి బూటో... అదికాదా మళ్ళీ ఎక్కడికన్నా... గెటవుట్..." బూటుకాలితో డొక్కలో తన్నాడు.

కింద పడి లేచి వోపిక లేకున్నా లెంపలేసుకున్నాడు. నాటు ప్రేమికుడు. కిమ్మనకుండా పడుతూ లేస్తూ వెళ్ళిపోయాడు. తుంటిమీద బలమైన రాతిదెబ్బ తిన్న కుక్కలాగా.

ఈలోగా నాటు ప్రేమికురాలిని జుట్టుపట్టి ఈడ్చి గుంజి లొంగదీశాడు కానిస్టేబుల్. "ఇదోసార్! ముండ— మాలావు టెంపరు మీదుంది—" అని దొరవారి బూట్లమీద పడేశాడు.

"సరే— వాడెక్కడా చూడు—"

"మన్నెబ్బతిని మళ్ళ రావటమా... అయినా నేను చూసుకుంటాగాని కాసేపు మీరు దాన్ని చూసుకోండి" అంటూ కానిస్టేబుల్ ఇందాక ప్రవేశించిన తీగలదారి కాయటానికి వెళ్ళాడు.

"యమ్మో... వదిలెయ్యండి బాబో—" అంటున్న నాటు ప్రేయసిని అటూ ఇటూ ఈడ్చి లేవదీశాడు ఇన్‌స్పెక్టర్. "వదిలేస్తాలేవే— కంత్రీ బిచ్... డాన్సర్‌లాగున్నావ్..." అంటూ ఇందాక లేవగొట్టిన చీకట్లోకే మళ్ళీ లాక్కెళ్ళాడు.

చీకట్లో సర్దుబాట్లు జరుగుతున్నాయి. అధికారదర్పానికి అవినీతి— సుఖాన్ని లంచం పెడుతోంది— తప్పదు కనుక—

తల తిరిగినట్లయింది.

చీకటిగా ఉన్నా, ఏదో శూన్యం.

పుస్తకాలూ, కాగితాలూ కూడదీసుకుని నెమ్మదిగా అక్కణ్ణుంచి వచ్చేశాను.

మెయిన్ రోడ్డు మీది కొచ్చాను. హాస్టలుకు పోబుద్ధి కాలేదు. అలాగే నడుచుకుంటూ టవున్లో కొచ్చాను. టీ తాగాను. ఎప్పుడోగానీ వెయ్యని పని సిగరెట్టు కాల్చాను.

చీకట్లో అవినీతి సహజమే. కాని, ఆ ఇద్దరికీ అందులో ఏదో సుఖం ఉంది. కాని, ఇదేమిటి? అధికారం—ఎంత జులుం కాకపోతే—

ఆలోచన సరిగా సాగలేదు.

అవిశ్రాంతిగా అనిపించి, ఖాళీ రోడ్లమ్మట తిరిగాను.

మళ్ళీ కాంపస్ వేపొచ్చాను. హాస్టల్‌కు వెళ్ళబుద్ధి కాలేదు అప్పటికీ.

అనుకోకుండా మళ్ళీ ప్లేగ్రౌండ్ వేపు వెళ్ళాను.

మలుపులో ఎదురైందొక స్త్రీ. ఆకారం చూస్తే ఇందాకటి నాటు ప్రేయసే! అదే నడక. తొందరగా నడుస్తూ మెయిన్ రోడ్డు క్రాస్‌చేసి అద్దరానివీ డొంకల వెనుక మాయమయింది.

మరో నాలు గడుగులు వేశాను.

ఎదురుగా వస్తున్నారు— ఇందాకటి మఫ్టీ పోలీసులు.

వీళ్ళు నన్ను అటకాయించరు గద, అనుకుంటూ ఉండగానే వాళ్ళ నవ్వులు వినిపించాయి.

"వండ్రఫుల్ గురూ... కాస్త జబ్బ బలం... చీటింగ్..."

"అయినా ఇదేం చీటింగ్... తప్పుకు తప్పు"

"వదిలెయ్...పిల్లయేం మజాగుందిరా. మంచి కోఆపరేషన్.. మొదట్లో గునిసిందిగాని.."

వాళ్ళను దాటబోతూ ఆగిపోయాను. గొంతులు గుర్తుపట్టాను.

అదిరి పడ్డాను. వాళ్ళు పోలీసులు కారు! నేనెరిగిన స్టూడెంట్స్! ఒకే పరీక్ష మూడేళ్ళుగా తప్పుతున్న వాళ్ళు! రాత్రిళ్ళు కంబైన్డ్ స్టడీస్(!) చేస్తున్న వాళ్ళు!

"హలో గురూ!..." అన్నారు వాళ్ళిద్దరూ, నన్ను గుర్తుపట్టి, "ఎలా ఉంది చదువు?... ఎలాగూ నీకింత చెప్పుండదు గాని.. ఇప్పుడింతకు ముందే భలే ఛాన్సు కొట్టాం..."

"కొట్టి— కొట్టాం— అనుకో—"

"ఛ!...మువ్వంద్రా... అంటే...చిన్న నాటక మాడాంలే గురూ..."

"నా కంతా తెలుసు—నే నంతా చూశాను.... చూళ్ళేకే అలా వెళ్ళిపోతున్నా— అయినా—మీరలు కోలేదు— అన్నాను.

నమ్మలేదు వాళ్ళు. నమ్మిన చాలాసేపటికి పకపకా నవ్వారు. "ఓకిటీజీ...జస్ట్ ఫన్—థ్రిల్లింగ్.." అన్నారు.

"వాళ్ళుకాక ఎవరైనా అంతేగా?" అన్నాను.

"ఏమాత్రం తెలుసున్న మొహమైనా—తెలివున్న మొహమైనా—వదిలేస్తాంగా—" అన్నారు.

"ఆ స్థితిలో మనలో ఒకరం ఉంటే? మాట వరసకి— ఉండే సందర్భం పడితే?..." అన్నాను.

"మన సంగతి వేరు... అలా ఎందుకనుకోవాలి? మనం ఎప్పుడూ అలా కాం...ఛాన్స్—అంతే.... అయినా... ఆ సంగతి ఇప్పుడెందుకూ?... మనం వేరు......"

నా అనుమానం 'వేరు' అని వాళ్ళూ నిజంగా అనుకోలేరని!... ★